క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. నేడు జరుపుకునే భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు సుఖసంతోషాలతో, భోగి మంటలతో, భోగ భాగ్యాలతో, ధన ధన్యాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట అశ్వర్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆకాంక్షించారు.

సంక్రాంతి స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఆర్టీసి డీఎం పిచ్చయ్య

మాచర్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య అన్నారు. హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, గుంటూరులకు ప్రత్యేక బస్సులను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక బస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసి బస్సులలో సురక్షితంగా ప్రయాణించాలని ఆయన కోరారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పట్టణ సీఐ మధుసూధన్‌రావు


పట్టణ సీఐ మధుసూధన్‌రావు

పిడుగురాళ్ల: సంక్రాంతిని పురస్కరించుకుని ఎవరైనా జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ఎం. మధుసూధన్‌రావు శుక్రవారం హెచ్చరించారు. పండుగను పురస్కరించుకుని జూదర్లు కోడి పందెలు నిర్వహించటం, పేకాట, నిమ్మకాయ పందెలు, నెంబర్ల ఆట, వంటివి ఎవరైనా నిర్వహిస్తే అటువంటి వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో, చుట్టాలతో, స్నేహితులతో సంతోషంగా గడుపుకోవాలని ఈ సందర్భంగా సీఐ మధుసూధన్‌రావు పేర్కొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రెంటచింతల: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎవరైన చట్టవ్యతిరేకంగా కోడిపందేలు నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సయ్యద్ షమీర్‌భాష హెచ్చరించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ షమీర్ భాష మాట్లాడారు. గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నివారించేందుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరూ సంతోషంతో జరుపుకోవాలని కోడిపందేలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం


పిడుగురాళ్ల పట్టణంలో రోడ్డుపై నిలిచి పోయిన వాహనాలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని హైదరాబాద్ వంటి మహా నగరాల నుంచి ఎక్కువ సంఖ్యలో కార్లు, వాహనాలు వస్తుండడంతో ఒక్కసారిగా రెండు రోజుల నుంచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. పట్టణ పోలీసులు ట్రాఫిక్‌పై మరింత దృష్టి సారించి వాహనాల రాకపోకల వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రోడ్డుల విస్తరణ చేయడం ఎంతగానో మంచిదైందని, లేకపోతే మరింత ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సి వస్తోందని ప్రయాణికులు, పట్టణ ప్రజలు అనుకుంటున్నారు.

నేడు ముగ్గుల పోటీలు

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామంలో భోగి, సంక్రాంతి పర్వదినాలను పుస్కరించుకుని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేరం రంగారెడ్డి, ఇగుటూరి సత్యనారాయణ రెడ్డి, పేరం నరేంద్రారెడ్డి, డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి, గొంటు కోటిరెడ్డి, తన్నీదు రాము శుక్రవారం తెలిపారు. చెన్నకేశవస్వామి దేవస్థానం సమీపంలో ఉదయం 10 గంటలకు ఈ ముగ్గుల పోటీలను నిర్వంచనున్నట్లు వెల్లడించారు. మొదటి బహుమతిగా 24 ఇంచల ఎల్ఈడీ టీవీ, రెండవ బహుమతిగా డ్రసింగ్‌టేబుల్, మూడవ బహుమతిగా నాలుగు పొయ్యిల గ్యాస్ స్టౌవ్, నాల్గొవ బహుమతిగా గ్రైండర్, ఐదవ బహుమతిగా నాన్ స్టిక్ కుక్‌వేర్ సెట్ అందచేయనున్నట్లు తెలిపారు. ఆశక్తి కల్గిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులను గెలుపొందాలని వారు కోరారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పెదగార్లపాడు వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : పల్నాడు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద గార్లపాడులో చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే కాసు గురువారం రాత్రి ప్రారంభించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చెట్టినాడ్ సిమెంట్ యజమాన్యం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో యాజమాన్యంను ఎమ్మెల్యే కాసు అభినందించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తన నియోజకవర్గంలో చెట్టినాడ్ సిమెంట్ యజమాన్యం పరిశ్రమాన్ని నిర్మించి ఉపాధి కల్పించిందన్నారు. ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసిన యజమాన్యాలు ఫ్యాక్టరీలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని, పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. పెదగార్లపాడు గ్రామ ప్రజలు దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న తక్కెళ్లపాడు-పెదగార్లపాడు రోడ్డును నిర్మించామని, దీని వల్ల మండల కేంద్రానికి ప్రయాణ దూరం తగ్గడంతో పాటుగా సకాలంలో గమ్యంకు చేరవచ్చునని ఆయన అన్నారు. పెదగార్లపాడులో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశామని, ఫేజ్-2లో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు త్వరలో ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు. పెదగార్లపాడు అభివృద్ధిపై తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నానని, ఈ గ్రామ పరిధిలో ఉన్న పరిశ్రమల ద్వారా పెదగార్లపాడులో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన వ్యాఖ్యనించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, లంచాలు, సిఫారసులు లేకుండా అర్హతే ఆధారంగా పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో చెట్టినాడ్ సిమెంట్స్ జాయింట్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్. సీతారాములు, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ సెల్వం, సీఎస్‌వో ఆర్‌వీఎస్ఎన్. మూర్తి, మేనేజర్ షేక్ అన్వర్, ఎంపీపీ కటకం జయశ్రీ బ్రహ్మనాయుడు, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు కటికాల వరలక్ష్మీ, పుప్పాల శివ, ఉపసర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి ముత్యం చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, గ్రామ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, నాయకులు లింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పురంశెట్టి శ్రీనివాసరావు, బైరపోగు కోటేశ్వరరావు, షేక్ నాగుల్‌మీరా, పిన్నం రోశయ్య పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ట్రస్టు నిర్వాహకుడు అశోక్

గురజాల : రంగవల్లులు మన సాంప్రదాయక చిహ్నాలు అని చింతలపూడి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు , వైద్యులు చింతలపూడి అశోక్ అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో శుక్రవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎంతో ఆందంగా రంగవల్లులు వేసే కళాత్మకత చెందిన వారన్నారు. ముగ్గులు వేయడం కూడా ఒక వ్యాయామంలో భాగమన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గండె చిన్న ఓబయ్య, నాయకులు చలవాది నారాయణ, చంటి, తదితరులున్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలి


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

దాచేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సాహించాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 19 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. క్రీడాకారులను ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు పరిచయం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, క్రీడల్లో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సాహిస్తే మంచి క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉందని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి చెప్పారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో పాటుగా తామంత క్రీడాకారులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, సర్పంచ్ వీర్ల వెంకయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి సైదారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, నాయకులు వేముల నాగిరెడ్డి, వేముల గురవారెడ్డి, పరిమి బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రైసైకిల్ అందజేత


దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మాచర్ల : పట్టణంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు స్వర్గీయ మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలను శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ, పల్నాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని పల్నాడు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చుండూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దివ్యాంగుడికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో పల్నాడు లయన్స్ క్లబ్ సభ్యులు అల్లం కోటిరెడ్డి, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ వై.రామచంద్రారెడ్డి, డాక్టర్ కమలాసనరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడుతూ క్లబ్‌కు చెందిన పాశం శ్రీనివాసరెడ్డి, బచ్చు రామసుబ్బారావు, నాగేశ్వరరావు, విశ్వనాథుని సాంబశివరావు, అంజిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, కెపి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దాచేపల్లి : రంగస్థల కళాకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జాతీయ రంగస్థల కళాకారుల సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు చింతపల్లి మస్తాన్, అధ్యక్షుడు పిన్నెల్లి శ్రీనివాసనాయుడు అన్నారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లాలో తెలుగు రాష్ట్రాల్లోని రంగస్థల కళకారుల సంక్షేమ సేవా సంఘం ముఖ్య నేతలు, కళాకారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో అఖిల పక్ష కమిటీతో పాటుగా తెలుగు రాష్ట్రాల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్, శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ..ఏళ్ల తరబడి రంగస్థల కళాకారులుగా జీవిస్తున్న తమకు ప్రభుత్వం నివేశన స్థలాలు మంజూరు చేయాలిని, 50 ఏళ్లు దాటిని కళాకారులకు పెన్షన్ వర్తింప చేయాలని కోరారు. రంగస్థల కళాకారుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎవీఆర్. చౌదరి, మోర్జంపాడు రామకృష్ణా, మాచవరం జానీ, నివాస్ వాల్మీకి, నర్సాపురం సైదా నాయక్, మాఘం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య, సిబ్బంది

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ పరిసరాలను శుభ్రపరచడంలో ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి డి లక్ష్మయ్య కోరారు. శుక్రవారం మండలంలోని రాయవరం గ్రామంలోని పరిసరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు వీధుల్లో మురికి నీరు ఎలా ఉంచుకోరాదని, ఎప్పటికప్పుడు తొట్లు, కొబ్బరిబోండాలు, ఖాళీగా ఉన్న పూలకుండీలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో వీధుల వెంట బ్లీచింగ్, క్లోరిన్ వంటి ఇతర మందులను వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ డి మురళీధర్, ఎఎన్ఎంలు దీనమ్మ, పిల్లలమర్రి రాజేశ్వరి, శాంతకుమారి, జయ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఫాగింగ్‌తో దోమల నివారణ చర్యలు


ఫాగింగ్ చర్యలు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

రెంటచింతల: పాలువాయి గ్రామంలో ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యగా పలు కాలనీలలో శుక్రవారం ఫాగింగ్ చేయించి దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి అన్నారు. ఫాగింగ్ యంత్రాలతో గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర పలు కాలనీలలో ఉన్న నివాస ప్రాంతాలలో, సైడ్‌కాలువలు, మురుగుకుంటలపై ఫాగింగ్ చేయించినట్లు ఆమె తెలిపారు. మన నివాసపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు అయితే విష జ్వరాలు, అంటు వ్యాధులు దరిచేరవన్నారు. హోటళ్ల నిర్వాహకులు, చిరువ్యాపారులు వ్యర్థపదార్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్‌లలో వేసి పంచాయితి వారికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండ్రెడ్డి అనంత కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మందలపు హనిమిరెడ్డి తదితరులున్నారు.

ఏఎన్‌యు వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఇరువురి విద్యార్థులు ఎంపిక


షేక్ లాల్‌బషీర్


పావని కుమారి

సత్తెనపల్లి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పట్టణంలోని అన్నం గురవమ్మ కృష్ణమూర్తి కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపిక య్యారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల, మహిళ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 12న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల వారు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏజీకేఎం కళాశాల బిఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి, వెయిట్ లిఫ్టర్ షేక్ లాల్ బషీర్ 89 కిలోల పురుషుల విభాగంలో స్నాచ్ లో 130 కిలోలు, క్లీన్, జర్క్‌లో 164 కిలోలు మొత్తం కలిపి 294 కిలోలు బరువు నెత్తి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అలాగే బిఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని, వెయిట్ లిఫ్టర్ కె.వి.ఎల్ పావని కుమారి 45 కిలోల మహిళల విభాగంలో స్నాచ్ లో 68 కిలోలు ప్లస్, క్లీన్,జర్క్‌లో 80 కిలోలు బరువు నెత్తి బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఇరువురు విద్యార్థులు విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికై విశ్వవిద్యాలయం తరపున ఈ నెల 27 నుంచి కేరళలో జరిగే ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ చూపిన వెయిట్ లిఫ్టర్లను శుక్రవారం కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ, సెక్రటరీ అన్నం బ్రహ్మం, సభ్యులు అన్నం కృష్ణ ప్రసాద్, అన్నం రామారావు, ప్రిన్సిపాల్ రామిశెట్టి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, కళాశాల అధ్యా పకులు, విద్యార్థిని, విద్యార్థులు, వాకర్స్ సభ్యులు అభినందించారు.

15 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏఓ రామమ్మ

మాచవరం: పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ప్రతి ఒక్క రైతులు ఈ నెల 15 లోగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏఓ కె.రామమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ పంటల యాజమాన్యం, ఈకేవైసీ, రబీలో పంటల నమోదు, అపరాలు, చిరుదాన్యాల సాగు, పలు అంశాలపై చర్చించారు. మండలంలో సుమారు 402 మంది రైతులు ఈకేవైసీ చేయించేకోవాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతుల వివరాలు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో సలహా మండలి చైర్మన్ సింగరయ్య, సభ్యులు దారం లచ్చిరెడ్డి, చిట్టిప్రోలు గురవయ్య, రాంబాబు, రమేష్, వీఏఓలు నర్సయ్య, సతీష్ పాల్గొన్నారు.

నేడు గోదాదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణం

పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద గల శ్రీ అభయ ప్రసన్నాంజనేయస్వామివారి దేవస్థానంలో గోదాదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవం, శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని స్వామివార్ల తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు తెలిపారు.

క్రీస్తు మార్గంలో జీవించాలి

మాచర్ల: సత్యస్వరూపియగు ఆత్మ వచ్చినప్పుడు మిమ్ములను సంపూర్ణ సత్యమును నడిపించును. దేవుని వాక్కు వినుటయే గాక ఆచరించువాడు దేవుని దీవెనలను పొందుకోగలడని దైవజనులు ఎర్నెస్ట్ పాల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 7వ వార్డులో, షాలోం మినిస్ట్రీస్ చర్చిలో జరుగుతున్న షాలోం తీర్మానాలు పండుగ ఘనంగా జరిగింది. దైవ ప్రార్థనలో పలువురు క్రైస్తవులు పాల్గొని దేవుని స్తుతించారు. దేవుని వాక్కు మన యందు పశ్చాత్తాపము, హృదయ పరివర్తన నాకు తోడ్పడుతుందన్నారు. క్రీస్తు ప్రభువు తన పవిత్రాత్మ అనుగ్రహము, విశ్వాసులకు అనుగ్రహించాలని ప్రార్థన చేశారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక


ప్రజావేదికలో పాల్గొన్న పీడీ జోసఫ్‌కుమార్

వెల్దుర్తి: పేద ప్రజలకు పనులు కల్పించే ఉపాధి హామీ పథకం పనుల పై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమాన్ని పీడీ జోసఫ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం 2020-21, 2021-22 సంవత్సరాలకు గాను 13, 14వ రౌండ్ సోషల్ ఆడిట్‌లో భాగంగా రెండు సంవత్సరాలలో నిర్వహించిన పనుల పై సామాజిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని 16 పంచాయతీల లోనూ, 11 శివారు గ్రామాలలో 2020-21 సంవత్సరంలో 290 పనుల పై రూ. 6,33,22,445 పనులు జరుగగా, రూ. 3,81,72,150లు కూలీలకు రూ. 2,51,50.260లు మెటీరియల్ పనులు జరిగాయన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 384 పనులు జరగగా రూ. 11,52,99,124ల పనులు జరిగాయన్నారు. అందులో రూ. 8,30,11,871 లు కూలీలకు చేరగా రూ. 3,22,87,253లు మెటీరియల్ పనులు జరిగాయన్నారు. ఈ రెండు సంవత్సరాల పనుల పై సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గ్రామాల్లో డీఆర్‌పిలు సామాజిక తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు జరిపి నివేదికను మండల స్థాయిలో జరిగే ప్రజావేదికలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిడి సిహెచ్ సురేంద్ర, వెల్దుర్తి, రెంటచింతల ఎంపీడీఓలు డి ప్రసాద్, షేక్ గౌషియా బేగం, ఎపిఓ రేఖా జ్యోతి, స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగార్జున, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, విఆర్ ఎఠ హనుమంతరావు, ఈసి వేణు, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వైఎస్సాఆర్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, చపారపు లచ్చిరెడ్డి, తోట ఆంజనేయులు, శివ, ఎంపీడీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాధుల కల్యాణం


ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాథస్వామి వార్ల కల్యాణ వేడుక


రాజుపాలెం వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాజుపాలెం: రాజుపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగోదారంగనాధుల కల్యాణ మహోత్సవ వేడుకలు రంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. వేదపండితులు రవితేజాచార్యులు, హస్వంత్ దీక్షితులు వేదమంత్రాలతో, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. కళ్యాణంలో దేవస్థానం దర్మకర్తలు పొత్తూరి సుబ్బారావు, వెంకటరమణ దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణంలో సుమారు 25 మంది దంపతులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భనజా కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కులు తీర్చుకున్న ప్రభుత్వ విప్ జంగా...

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణం అనంతరం శాసన మండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ప్రత్యేక మొక్కలు తీర్చుకున్నారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమణసుబ్బారావు, పూజారి కిషోరాచార్యులు జంగాను వేద మంత్రా నడుమ పూర్ణకుంభంతో దేవస్థానంలోకు ఆహ్వానించారు. జంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పూజారి తీర్థప్రసాదాలు అందించారు.

గోదాదేవి, శ్రీరంగనాథస్వామివార్ల కల్యాణ వేడుక

నకరికల్లు: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాథ స్వామివార్ల కల్యాణ వేడుక శుక్రవారం కన్నుల పండువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ధనుర్మాసం పురస్కరించుకుని అర్చకులు కొండవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు, శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, హోమములు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజాధికాల్లో పాల్గొనాలన్నారు.

మంచు, చలితో అల్లాడుతున్న ప్రజలు

మాచర్ల: పట్టణాన్ని గత వారం రోజులుగా మంచు కప్పేస్తుంది. చలి పెరగడంతోపాటు మంచు కప్పేస్తుండడంతో ఉదయం వేళ ప్రజలు బయటకు రావడానికే ఆందోళన చెందుతున్నారు. పండుగ వేళల్లో సైతం ప్రజలు చలి, మంచుతో ఇబ్బందిపడుతున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే మంచు కప్పేసి చలి వెంటాడుతుండడంతో ఎక్కడికక్కడు పలువురు చలి మంటలు వేసుకొని చలి నుంచి కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నేడే ముత్యాలమ్మ తిరుణాళ్ల

రాజుపాలెం: మండలంలోని అనుపాలెంకు తూర్పు వైపున ఉన్న కొండపై కొలువుదీరిన ముత్యాలమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిటి కొంగు బంగారం అంటూ కొలుస్తారు. ముత్యాలమ్మ తల్లిని జంట గ్రామాలైన అనుపాలెం, అంచులవారిపాలెంకు చెందిన గ్రామస్తులు కులదైవంగా పూజిస్తారు. దీనికి గాను అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా తీర్చిద్దారు. రెండు గ్రామాల్లోని గృహాల్లో ఏ శుభకార్యం చేయాలన్నా ముందుగా ఆ దేవతకు మొక్కులు చెల్లించి ఆ పనిని ప్రారంభిస్తారు. ఈ ఆదిపరాశక్తికి ఏటా శతాబ్ది కాలం నుంచి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 14వ తేదీ శనివారం తిరుణాళ్ళ నిర్వహిస్తారు. పాడి పంటల బోగభాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకు అతీతంగా తొలి ధాన్యపుకంకులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి చీరా, సారెలతో వాయిద్యాల నడుమ బోణాలను నెత్తిన పెట్టుకుని మొక్కులు తీర్చుకుంటారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



దుర్గి: జంగాల కాలనీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం, సరుకులు అందజేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బాధితులను ఓదార్చి నగదు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్ళి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల విఆర్ఓ సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రేవల్లి ఎల్లయ్య, చెన్నుపాటి శ్రీను, రేవల్లి అల్లూరయ్య, రాజలింగం, శివ తదితరులున్నారు.

